సాక్షి
అనకాపల్లి
ఆదివారం ၊ 27 ၊ అక్టోబర్ ၊ 2024



పరిశ్రమల పాత్ర అభినందనీయం
వివిధ పారిశ్రామిక ప్రతినిధులతో కలెక్టర్ విజయ కృష్ణన్ సమావేశమయ్యారు. సామాజిక సేవకు తోడ్పడాలని కోరారు. 8లో



ఓపెన్ హౌస్ 8లో
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఓపెన్ హౌస్ విద్యార్థులను అలరించింది.



విద్యార్థినుల సందడి
బీచ్‌రోడ్డు: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బోటనీ విభాగం విద్యార్థినులు శనివారం బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు.

హనీట్రాప్ కేసులో కూటమి ఎమ్మెల్యే?

- పోలీసులకు తలనొప్పిగా మారిన జాయ్ జమీనా కేసు
- రెండుసార్లు పోలీసులు కస్టడీకి తీసుకున్నా నోరు విప్పని యువతి
- ముఠాలో ఉన్న వారి వివరాల కోసం విశ్వప్రయత్నాలు
- వివరాలు గోప్యంగా ఉంచుతున్న పోలీసులు



విశాఖ సిటీ: హనీట్రాప్ కేసు వ్యవహారంలో కూటమి ఎమ్మెల్యే ఉన్నారా? బీజేపీ యువనేతలకు కూడా ఈ కేసుతో ప్రమేయముందా? వీరూ హనీట్రాప్ బాధితులా? లేదా యువతి ద్వారా వ్యాపారులను దోచుకుంటున్న సూత్రధారులా? ఇప్పుడివే సందేహాలు సర్వత్రా చక్కర్లు కొడుతున్నాయి. వ్యాపారులు, బిగ్ షాట్స్ లక్ష్యంగా జాయ్ జమీనా అనే యువతి వలపు వల విసిరి.. వీడియోలు, ఫొటోలతో బ్లాక్ మెయిల్ చేసి రూ.లక్షలు కాజేసిన కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ముందు వ్యాపారులు మాత్రమే ఆమె వలలో చిక్కుకున్నట్లు భావించినప్పటికీ.. ఆ జాబితాలో రాజకీయ నాయకులు కూడా ఉన్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ కేసు వివరాలు బయటకు వెల్లడించకుండా పోలీసులు అత్యంత గోప్యత పాటిస్తుండడం కూడా ఈ వాదనలకు బలాన్ని చేకూరిస్తోంది.

వలపు వల విసిరి.. రేప్ కేసు పెట్టి..
జాయ్ జమీనా కోసం ఎన్ఆర్ఐ యువకుడు అమెరికా నుంచి వచ్చి.. ఆమె వలలో చిక్కుకొని రూ.లక్షలు పోగొట్టుకున్నాడని.. అతడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హనీట్రాప్ వ్యవహారం బట్టబయలైంది. అప్పటి నుంచి ఈ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. విచారణలో ఆమె వ్యవహరించిన తీరు పట్ల పోలీసులు విస్తుపోయారు. ఎన్ని రకాలుగా ప్రశ్నించినా ఆమె నోరువిప్పనట్లు తెలిసింది. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి.. గతంలో ఈ తరహా కేసులు ఎక్కడైనా నమోదయ్యాయా? అని దృష్టి పెట్టారు. ఈ క్రమంలో గతంలో ఆమె ఒక వ్యక్తిపై పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో రేప్ కేసు నమోదు చేసినట్లు గుర్తించారు. ఆ కేసు వివరాలను ఆరా తీయడంతో హనీట్రాప్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు ఆమెను భీమిలి పోలీస్‌స్టేషన్‌లో విచారించినప్పటికీ ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పనట్లు సమాచారం. దీంతో ఆమెను అరెస్టు చేసి కోర్టుకు ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు. ఇంతలో కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా ఆమె ఇద్దరి వ్యాపారులను ఇదే తరహాలో మోసం చేసినట్లు ఫిర్యాదు అందాయి.

బాధితులా.. సూత్రధారులా..

హనీట్రాప్ కేసు విషయంలో పోలీసుల వ్యవహారశైలి అనేక అనుమానాలకు తావిస్తోంది. బాధితుల ఫిర్యాదు నమోదు నుంచి నిందితురాలి కస్టడీ విచారణ వరకు అన్నింట్లోను పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. ఈ కేసులో కూటమి ఎమ్మెల్యేతో పాటు బీజేపీ యువనాయకులు కూడా ఉన్నారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. వీరు నిందితురాలి ట్రాప్‌లో చిక్కుకున్న బాధితులా? లేదా ఆమె వెనుక ఉన్న సూత్రధారులా? అన్న సందేహాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అందువల్లే పోలీసులు ఈ కేసు వివరాలను బయటకు వెల్లడించడం లేదన్న వాదనలు ఉన్నాయి.

స్ప్రే కొట్టి.. ముగ్గులోకి దించి..

జాయ్ జమీనా ట్రాప్‌లో చిక్కుకున్న వారు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ఆమె వ్యాపారులను దోచుకున్న తీరుపై కూడా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముందుగా రెస్టారెంట్, కాఫీషాప్, రాజకీయ నేతలు ఇలా ఆర్థికంగా బలమైన వారినే ఎంచుకుంది. వారిని ఏదో ఒక విధంగా పరిచయం చేసుకొని, ఫోన్ నెంబర్ తీసుకొని, కవ్వింపు మాటలతో ముగ్గులోకి దింపేది. ఒక రోజు వారితో కారులో బయటకు వెళ్లడం.. ఆ సమయంలో వారి ముఖంపై ఒక రసాయనాన్ని స్ప్రే చేయడం.. ఇంటికి తీసుకువెళ్లడం.. వారు వద్దన్నా డ్రింక్ లేదా కాఫీ బలవంతంగా తాగించడం.. ఆ తరువాత బాధితులు మత్తులోకి జారిపోవడం.. లేచి చూసేసరికి ఆమెతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలు చూపించి బ్లాక్ మెయిల్ చేయడం.. రూ.లక్షలు డిమాండ్ చేయడం.. పెళ్లి చేసుకోమని కత్తితో బెదిరించడం.. డబ్బు ఇవ్వని వారిపై రేప్ కేసు పెట్టడం.. ఇదే తరహాలో అనేక మందిని ఆమె దోచుకున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. ఈ జాబితాలో వ్యాపారులు, ఎన్ఆర్ఐలతో పాటు రాజకీయ నేతలు సైతం ఉన్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి.

రెండు సార్లు కస్టడీకి తీసుకున్నా..

జమీనా నుంచి పూర్తి వివరాలు రాబట్టేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే భీమిలి స్టేషన్‌లో నమోదైన కేసులో ఆమె అరెస్టయింది. కోర్టు ద్వారా ఆమెను కస్టడీకి తీసుకొని విచారించారు. ఆమె వెనుక ఉన్న ముఠా సమాచారం కోసం పోలీసులు ఎన్ని విధాలుగా ప్రశ్నించినా.. నోరు విప్పడం లేదని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆమె ల్యాప్‌టాప్, మొబైల్‌లో ఉన్న సమాచారం సేకరించడానికి చేసిన ప్రయత్నాలు కూడా బెడిసికొట్టినట్లు తెలుస్తోంది. పోలీసుల ప్రశ్నలకు సమాచారం చెప్పాల్సిన అవసరం తనకు లేదని, నచ్చింది చేసుకోమని ఆమె సమాధానమివ్వడంతో పాటు తిరిగి వారినే బెదిరిస్తూ మాట్లాడినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కస్టడీ సమయం ముగియడంతో ఆమెను మళ్లీ జైలుకు పంపించారు. అయితే కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కాఫీషాప్ యజమాని ఫిర్యాదుపై నమోదైన కేసులో కూడా గత రెండు రోజుల క్రితం ఆమెను రెండోసారి కస్టడీకి తీసుకున్నారు. ఇక్కడ కూడా ఆమె నుంచి వివరాలు రాబట్టడానికి ప్రయత్నించారు.

సిరి ధాన్యాలు.. నోరూరించే రుచులు

SUNDAY SPECIAL

ఆరోగ్య స్పృహ పెరిగింది.. చిరు ధాన్యాలపై అందరి దృష్టి పడింది.. మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాలకు బాగా పనిచేయడంతో వీటి వినియోగం ఎక్కువైంది.. రైతులు కూడా ఇప్పుడు రాగులు, తెల్లజొన్నలు, సామలు, సజ్జలు, కొర్రలు వంటి మిల్లెట్స్‌ను ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే ఇప్పటికీ చాలామందిలో మెదిలే ప్రశ్న.. చిరు ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు రుచిగా ఉంటాయా..? వాటిని ఇష్టపడి తినగలమా..? అందుకు సమాధానమే ఈరోజు 'సండే స్పెషల్' కథనం..

- మళ్లీ పాత రోజుల వైపు జీవన విధానం
- పెరుగుతున్న చిరు ధాన్యాల వినియోగం
- ఆర్ఏఆర్ఎస్‌లో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ సిద్ధం



చిరు ధాన్యాలు

సాక్షి, అనకాపల్లి: ఉప్మా, పులిహోర, ఫ్రైడ్ రైస్, పాయసం, దోసెలు.. వంటి ఎన్నో పదార్థాలను చిరు ధాన్యాలతో నోరూరించే రుచుల్లో తయారు చేయవచ్చు. కొంత కాలం క్రితం వరకూ వీటిని సాధారణ ధాన్యాల్లానే చూసేవారు. కానీ ఇప్పుడు ఆరోగ్య ప్రదాయినిగా కీర్తిస్తున్నారు. వైద్యులు కూడా సూచించడంతో రోజురోజుకూ వీటి వినియోగం పెరుగుతోంది. ఒకపక్క చిరు ధాన్యాల సాగు పెరుగుతుండగా.. మరోపక్క వీటితో రుచికరమైన పదార్థాలను వండి వడ్డిస్తున్న హోటళ్లు ఎక్కువవుతు న్నాయి. చిరు ధాన్యాలను వివిధ రూపాల్లో ఆహారంగా తీసుకునేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు.

భవిష్యత్తుల్లో 70 శాతం మందికి ఇదే ఆహారం
అన్నం తింటే రక్తంలో చక్కెర.. గోధుమ రొట్టెల్లో కార్బోహైడ్రేట్స్ ఎక్కువ.. ఇలా ఆహార పదార్థాల్లో పోషకాలపై జరుగుతున్న అధ్యయనాలు భోజనపు అలవాట్లను మారుస్తున్నాయి. అందుకు అనుగుణంగా పంటల సాగులో కూడా మార్పులు వచ్చి సంప్రదాయక ఆహార పంటలకు మళ్లీ డిమాండ్ పెరగనుందని పోషకాహార నిపుణులు అంచనా వేస్తున్నారు. చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువలతో 70 శాతం జనాభాకు అవే ప్రధాన ఆహార వనరుగా మారుతుందని జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనంలో తేలింది. చిరుధాన్యాలతో డయాబెటిస్, బీపీ, గుండెపోటు, కాలేయ సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయని, 60 ఏళ్లు దాటిన వారు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు మిల్లెట్స్ తీసుకోవడంతో పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని సంపాదించవచ్చని వైద్యుడు డాక్టర్ లక్ష్మీకాంత్ చెప్పారు.

ఆర్ఏఆర్ఎస్‌లో 'పాయసం మిక్స్'



చిరుధాన్యాలతో పాయసం

ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్తలు శనివారం చిరుధాన్యాలతో 'పాయసం మిక్స్'ను తయారుచేశారు. పాయసం జొన్నలు, రాగులు, సామలు, సజ్జలు, కొర్రలు, పెసలు, బెల్లం, జీడిపప్పు, బాదంపప్పు ఉపయోగించి తయారు చేసుకోవచ్చని ఆర్ఏఆర్ఎస్ సాంకేతిక పరిజ్ఞాన విభాగం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త పి.వి.కె.జగన్నాథరావు వివరించారు. చిరుధాన్యాలన్నీ కలిపి మిక్స్ చేసిన తరువాత పాయసం ఎలా చేసుకోవాలో వివరించారు. ఈ పాయసం మిక్స్‌లో పిండి పదార్థాలు 63 గ్రాములు, మాంసకృత్తులు 9.2 గ్రా., కొవ్వుపదార్థాలు 1.9 గ్రా., కాల్షియం 34.5 మి.గ్రా., ఐరన్ 2.2 మి.గ్రా., జింక్ 1.2 మి.గ్రా. ఉంటాయని వివరించారు. చిరుధాన్యాలతో పాయసం పిండి తమ వద్ద కేజీ రూ.192లకు లభిస్తుందన్నారు. అయితే ముందుగా ఆర్డర్ చేయాలన్నారు. చిరుధాన్యాల పాయసం మిక్స్‌లో కాల్షియం, ప్రొటీన్లు ఎక్కువగా ఉండడం వల్ల అన్ని వయసుల వారికి ఆరోగ్యకరమని, చిన్నారులకు అల్పాహారంగా అందించడం వల్ల వారి ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఆర్ఏఆర్ఎస్‌లో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

ఇసుక దందా చేస్తే పీడీ యాక్టు నమోదు

- సొంత భూముల్లో ఇసుక తవ్వాలన్నా అనుమతి తప్పనిసరి
- వాల్టా చట్టంపై అవగాహన కల్పించాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ జాహ్నవి

తుమ్మపాల : వ్యక్తిగత అవసరాల పేరిట ఇసుక వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులకు ఇసుక తవ్వకాలపై ఆదేశాలు జారీ చేశారు. వ్యక్తిగత అవసరాలకు ఇసుక తవ్వకాలు జరిపే చోట వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన ఇసుక పాలసీ ద్వారా ప్రభుత్వం సీనరేజి, జీఎస్టీ రద్దు చేయడం జరిగిందని, స్థానిక అవసరాలకు ఇసుక ఉచితంగా తీసుకువెళ్లడానికి అవకాశం కల్పించిందని తెలిపారు. వంతెనలు, కట్టడాలు, మంచినీటి పథకాలకు యాభై మీటర్ల దూరం వరకు, కరకట్టలకు పదిహేను మీటర్ల వరకు, భూగర్భ జలాలు తక్కువగా గల చోట్ల తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనిపై గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. ఇసుక కనీసం మూడు మీటర్లు ఎత్తు ఉన్న చోట మాత్రమే ఒక మీటరు వరకు ఇసుకను తీసుకోవచ్చునని తెలిపారు. భూగర్భ జలాలు నిలకడగా ఉండడానికి నదిలో కనీసం రెండు మీటర్ల ఎత్తున ఇసుక ఉండాలని తెలిపారు. స్థానికంగా సొంత అవసరాలకు ఇసుక కావలసిన వారు స్థానిక అధికారులకు సమాచారం అందించి తీసుకోవాలని తెలిపారు. ఎడ్ల బళ్ల ద్వారా మాత్రమే తీసుకువెళ్లాలని, ఇసుక తవ్వడానికి, రవాణాకు మోటారు వాహనాలు వినియోగించకూడదన్నారు. సొంత అవసరాల పేరిట బళ్లపై ఇసుకను తీసుకువచ్చి వాహనాల ద్వారా వ్యాపారం చేసే వారిపై కేసులు పెట్టడం జరుగుతుందని, పీడీ యాక్టు ప్రయోగించడం జరుగుతుందని హెచ్చరించారు.

జిల్లాలో ఇసుక రీచ్‌లు లేవు..
జిల్లాలో ఇసుక రీచ్‌లు లేవని, స్టాకు పాయింట్లు నక్కపల్లి, గబ్బాడ వద్ద ఉన్నాయని, ఇసుక కావలసిన వారు ప్రస్తుతం ఇసుక అందుబాటులో గల గబ్బాడ పాయింటు నుంచి మాత్రమే బుకింగ్ ద్వారా పొందవచ్చునని కలెక్టర్ తెలిపారు. సొంత భూముల్లో ఇసుక గలవారు కూడా ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. జేసీ ఎం.జాహ్నవి మాట్లాడుతూ బల్క్ బుకింగ్ ద్వారా ఇసుక కావలసిన వారు తమకు దరఖాస్తు చేస్తే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు.

ఇసుక తరలిపోకుండా చెక్‌పోస్టులు : ఎస్పీ
ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే వారిపై కేసులు పెట్టడంతో పాటు పీడీ యాక్టు ప్రయోగిస్తామన్నారు. ఇసుక రవాణాకు ఇ-ట్రాన్సిట్ ఫారం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఇసుక రవాణాకు ఉపయోగించే అన్ని వాహనాలకు జీపీఎస్, ఉచిత ఇసుక పథకం బ్యానర్ ఉండాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక కార్యకలాపాలు నిర్వహించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాలు తనిఖీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, జిల్లా గనుల శాఖ అధికారి ఎం.శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీకి స్పీకర్‌దే బాధ్యత

- అయ్యన్నపాత్రుడు వెంటనే పదవికి రాజీనామా చేయాలి
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ డిమాండ్
- గబ్బాడ డిపో నుంచి ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు ఫిర్యాదు -8లో

పెదమదీన గ్రామసభ రసాభాస

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన టీడీపీ నేతలు
- నాలుగు నెలల్లో ఏం సాధించారని నిలదీసిన ప్రజలు
- రాజకీయాల ప్రస్తావనతో మధ్యలోనే నిష్క్రమించిన తహసీల్దార్

బుచ్చెయ్యపేట: పెదమదీన గ్రామసభలో టీడీపీ నాయకుల అత్యుత్సాహంతో ప్రజలు తిరగబడ్డారు. గ్రామస్తుల తిరుగుబాటుతో గ్రామ సభ నుంచి అధికారులు వెళ్లిపోగా.. గొడవ పెరిగి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా ఉందని టీడీపీ నాయకులు చల్లబడ్డారు. శనివారం పెదమదీన గ్రామంలో తహసీల్దార్ లక్ష్మి గ్రామ సభను ఏర్పాటు చేశారు. గ్రామ సభ ప్రారంభంలోనే గ్రామ మాజీ సర్పంచ్ వియ్యపు అప్పారావు, ఎంపీటీసీ భర్త మరిడి బాబులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో భూ రికార్డులను తప్పుగా తయారుచేశారని, తప్పులు సరిచేసేందుకు టీడీపీ ప్రభుత్వం గ్రామ సభలను ఏర్పాటు చేసిందని రాజకీయంగా మాట్లాడటంతో ప్రజలు ఆగ్రహం చెందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూపాయి తీసుకోకుండా ఉచితంగా భూ సర్వే చేసి తమ భూములకు సరిహద్దులు నిర్ణయించి సర్వే రాళ్లు పాతారని, సర్వేలో ఏమైనా తప్పులుంటే సరిచేయమని ఈ ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసింది తప్ప ఈ నాలుగు నెలల్లో ఏం ఒరిగిందని టీడీపీ నాయకులను నిలదీశారు. దీంతో అక్కడే ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జిల్లా యువజన విభాగం కార్యదర్శి జోగా కొండబాబు, లాయర్ చొప్పా బాబూరావు, నాయకులు శొంఠ్యాన గోవింద, కె.శ్రీను తదితరులు కల్పించుకొని గ్రామ సభలో రాజకీయాలు మాట్లాడవద్దని సూచించారు. టీడీపీ నేతలు పదేపదే గొప్పలు చెప్పడం, దీనికి గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుతగలడంతో గ్రామ సభ గందరగోళంగా తయారైంది. దీంతో తహసీల్దార్ లక్ష్మి విసుగుచెంది.. గ్రామ సభను నిర్వహించాలని కింది స్థాయి ఉద్యోగులకు బాధ్యత అప్పగించి వెళ్లిపోయారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్ సాయి, వీఆర్వో ప్రణవి రైతుల నుంచి వినతులు స్వీకరించారు.



అధికారులు మధ్యలోనే వెళ్లిపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

క్లుప్తంగా

హాస్టల్లో లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ జరపండి

- న్యాయమూర్తి, తహసీల్దార్లకు ఎస్ఎఫ్ఐ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యలమంచిలి రూరల్: లైనుకొత్తూరు న్యూలైఫ్ హాస్టల్లో కేర్ టేకర్ లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు శనివారం యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, తహసీల్దార్ కె.వరహాలును కోరారు. వేర్వేరుగా వారిని కలిసిన విద్యార్థి సంఘం నాయకులు మైలపల్లి బాలాజీ, కేశవ దారుణ ఘటనపై మరోసారి విచారణ జరిపించాలని కోరారు. న్యూలైఫ్ హాస్టల్ నిర్వహణ నిబంధనల ప్రకారం జరగడంలేదన్నారు. అక్కడ వసతి పొందుతున్న బాలబాలికలకు సరైన రక్షణ అవసరమని, ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కశింకోట విద్యార్థినులు



ఎంపికైన బాలికలకు అభినందన

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్, వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అండర్- 17 విభాగంలో ఎస్.గ్రీష్మ, అండర్-14 విభాగంలో ఆర్. భవాని, వాలీబాల్ అండర్- 14 విభాగంలో వి.వేదిక ప్రతిభ చాటి ఎంపికయ్యారు. వీరిని శనివారం స్థానిక హైస్కూలులో హెచ్ఎం ఎం.ఎస్. స్వర్ణకుమారి, పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు అభినందించారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

నర్సీపట్నం: పట్టణంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడు ఆర్.శివ(27)పై పోక్సో కేసు నమోదు చేశామని టౌన్ సీఐ జి.గోవిందరావు శనివారం తెలిపారు. ఈ నెల 25న స్కూల్‌కు వెళ్లిన విద్యార్థినిని కిడ్నాప్ చేశాడన్నారు. ఆమె ఇంటికి చేరకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. బంధువులు వెతుకుతున్న విషయం తెలుసుకున్న యువకుడు విద్యార్థినిని రాత్రి 11 గంటల సమయంలో వదిలి పెట్టాడని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పోలీసు విధులపై అవగాహన కోసమే ఓపెన్ హౌస్

- ఎస్పీ తుహిన్ సిన్హా
- ఆయుధాలు, ఇతర పరికరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, పోలీసు అధికారులు

సాక్షి, అనకాపల్లి : దేశ రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో వారు వినియోగించే అత్యాధునిక ఆయుధాలు, వివిధ పరికరాలు, కమ్యూనికేషన్, బాంబు డిస్పోజల్ పరికరాలు తదితర అంశాలను విద్యార్థులకు వివరించామన్నారు. విధుల్లో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లు, వారి త్యాగాలు గురించి ప్రతి విద్యార్థి, యువత తెలుసుకోవాలని, దేశ భద్రత కోసం పనిచేసే రక్షణ ఉద్యోగాల్లో చేరేందుకు యువత ఆసక్తి చూపించాలనే ఉద్దేశంతో ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. పోలీసు శాఖ ప్రజల సేవ కోసమే పనిచేస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి , కశింకోటలో గల జీవీఎంసీ బాలికల హై స్కూల్, జూనియర్ కాలేజ్, ఆదిత్య డిగ్రీ కాలేజ్, చైతన్య జూనియర్ కాలేజ్, వివేకానంద డిగ్రీ కాలేజ్(కశింకోట), సెయింట్ జోస్ కాలేజ్ (కశింకోట), ఆర్‌జీఆర్‌పీ పాలిటెక్నిక్ కళాశాల (కశింకోట) విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, వ్యక్తిత్వ పరీక్ష పోటీలను నిర్వహించడంతో పాటు, అమరులైన పోలీసు కుటుంబాలను పరామర్శించడం, బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లు వంటివి నిర్వహించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో బాంబు డిస్పోజబుల్ టీం, కమ్యూనికేషన్ టీం వారు ఆర్మ్‌డ్ పోలీసులు వినియోగించే ఎకె-47, పిస్టల్, గ్లో 17, కార్బన్, ఇన్సాస్ రైఫిల్, మల్టీ గ్యాస్ గన్ లాంచర్, గ్రనేడ్ తదితర ఆయుధాల గురించి వివరించారు. మాబ్‌ని కంట్రోల్ చేసే వజ్ర వాహనం, రైట్ గేర్ ఎక్విప్‌మెంట్‌ను ప్రదర్శించారు. నైట్ విజన్, శాటిలైట్ ఫోన్, స్కానర్, వీహెచ్ఎఫ్ సెట్, రోబో డ్రెస్ తదితర వాటిని ప్రదర్శనలో ఉంచారు. బాంబ్ డిస్పోజల్ టీం వినియోగించే డీప్ సెర్ప్ మెటల్ డిటెక్టర్, డిఫ్యూజ్ అండ్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్, బాంబ్ స్యూట్, టెలిస్కోప్ మ్యానిపులేటర్, రిమోట్ వైర్ కట్టర్‌లను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, మన్మథరావు, రామకృష్ణారావు, సంజీవరావు, విజయ్‌కుమార్, వెంకటరమణ, అశోక్ కుమార్, కశింకోట ఎస్‌హెచ్‌ఓ స్వామి నాయుడు, ఎస్ఐలు ఈశ్వరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

అయోడిన్ మన శరీరానికి సూక్ష్మ పోషకం

- అయోడిన్ దినోత్సవంలో డీఎంహెచ్‌వో బాలాజీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలాజీ

అనకాపల్లి: అయోడిన్ మన శరీరానికి కావలసిన ఒక సూక్ష్మ పోషకమని డీఎంహెచ్‌వో ఎం.వి.కె. బాలాజీ తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో ప్రపంచ అయోడిన్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోప రుగ్మతుల నివారణకు అయోడైజ్డ్ ఉప్పునే వాడాలన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అయోడిన్ ఉప్పు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మనం తినే ఆహారంలో అయోడిన్ లోపం ఉన్నట్లయితే మహిళల్లో గర్భస్రావం, మృత శిశు జననాలు, నెలల నిండకుండా ప్రసవం, పిల్లలలో పుట్టుకతో లోపాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కొంతమంది పిల్లలకు మరుగుజ్జు, బుద్ధిమాంద్యం, చెవుడు, మూగ వంటి వైకల్యాలు సంభవిస్తాయన్నారు. నివారణకు అయోడిన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కొంత మందికి థైరాయిడ్ గ్రంథి పెరిగి గొంతువాపు ఏర్పడుతుందని, దీనినే ''గాయిటర్'' అంటారన్నారు.

కార్యక్రమంలో వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి జె.ప్రశాంతి, ఎన్‌సీడీ ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ అధికారి విశ్వనాథం తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యుడు విశ్వనాథం పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు విశేష స్పందన



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలో వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలకు విశేష స్పందన లభించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, గురుకులాల నుంచి 219 మంది బాలబాలికలు పాల్గొన్నారు. హెచ్ఎం మూర్తిరాజు, సర్పంచ్ ఏడిద నూకరత్నం, ఎంపీటీసీ కుంచా మధు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

అండర్ - 17 బాలుర విభాగంలో పి. వవన్‌కుమార్, పి. యువరాజు, ఎస్. అభిరామ్, ఎన్. అనిల్ కార్తీక్, ఎల్.డి. వినయ్, జి. గణేష్, కె. జశ్వంత్, టి. హేమవర్ధన్, డి.ఎల్. నర్సింహ, ఎస్. పవన్ కుమార్, బాలికల విభాగంలో జి. భవిత, కె. ప్రణతి, శ్రీముఖి, కె. వెంకటవైష్ణవి, టి. శరణ్యశ్రీ, పి. శైలజ, జె. యశస్విని, పి. తబితజోత్స్న, వై. దేవి విజేతలుగా నిలిచారు.

అండర్ - 14 బాలికల విభాగంలో ఎస్. ఝాన్సీలక్ష్మి, డి. హర్షిత, బి. వైష్ణవి, ఎస్. కౌశిక, బి. యశస్విని, జి. ఇంద్రజ, ఎ. గీతిక, బి. జయశ్రీహర్షవర్ధిని, జి. ప్రణతి, బాలుర విభాగంలో కె. వెంకట్, పి. గోపాలరావు, బంగార్రాజు, క్రాంతిసాగర్, కె. నవనీత్, కె. సందీప్, ఎం. హర్ష, పి. నిఖిల్, ఎం. శేషగిరి, ఆర్. వినయ్‌యశ్వంత్ విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు ప్రదానం చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థి



బంగారు పతకాన్ని సాధించిన విద్యార్థితో పీఈటీ తరుణేశ్వరరావు

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన 8వ తరగతి విద్యార్థి ఆర్. తరుణ్ ఎంపికయ్యాడు. పరవాడ మండలంలోని లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న అండర్-14 విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థి తరుణ్ ప్రాతినిధ్యం వహించిన జిల్లా జట్టు బంగారు పతకం సాధించింది. ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. విద్యార్థితో పాటు తర్ఫీదు నిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జి. తరుణేశ్వరరావును గురుకుల ప్రిన్సిపాల్ పి. రఘు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇరటా నర్సింహమూర్తి తదితరులు స్థానిక గురుకులంలో శనివారం అభినందించారు.

10 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

నాతవరం: గుట్టుచప్పుడు కాకుండా సారా తయారు చేసి విక్రయిస్తుండగా వ్యక్తిని పట్టుకున్నామని ఎస్ఐ సిహెచ్.భీమరాజు శనివారం తెలిపారు. సుందరకోట గ్రామ తోటలో సారా తయారు చేస్తున్నట్టుగా అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. సరుగుడు గ్రామానికి చెందిన బూదర్ల శివ సారా పట్టుకుని వస్తుండగా మాటు వేసి పట్టుకుని, అతని వద్ద నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ప్రాంతంలో సారా విచ్చలవిడిగా తయారు చేసి విక్రయాలు చేస్తున్నట్టుగా ఫిర్యాదులు అందాయన్నారు. అప్పట్నుంచి ఈ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి సారా తయారీ, విక్రేతలపై నిఘా పెట్టామన్నారు.

'ఇసుక దోపిడీకి స్పీకర్‌దే బాధ్యత'



సీఐ రేవతమ్మకు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: తన నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక దోపిడీకి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. గబ్బాడ డిపోలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రూరల్ సీఐ ఎల్.రేవతమ్మకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకుల అండదండలతో గబ్బాడ ఇసుక డిపోలో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో అక్రమంగా ఇసుకను లారీల్లో లోడ్ చేశారన్నారు. టీడీపీ నాయకులు డిపోలో గత ఐదు రోజులుగా పెద్ద ఎత్తున ఇసుక దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. డిపోలోని సీసీ పుటేజ్‌లను బయటకు తీస్తే ఇసుక దొంగలు బయటపడతారన్నారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘాలో గబ్బాడ ఇసుక డిపో ఉన్నప్పటికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అండదండలతో ఇసుక దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. డిపోలోకి వచ్చిన రెండు లారీలకు అనుమతులు ఉన్నదీ లేనిదీ అధికారులు నిగ్గు తేల్చాలన్నారు. డిపో వేళలు ముగిశాక లారీలు ఇసుక యార్డులోకి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తమ పార్టీ నాయకులు ఈ రెండు లారీలను పట్టుకుని అధికారులకు అప్పగిస్తే ఎందుకు వదిలేశారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని గణేష్ పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నాలుగు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పరిశ్రమల పాత్ర అభినందనీయం



పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

- విజయవాడలో వరద బాధితులకు రూ.1.8 కోట్ల అందజేత
- ప్రభుత్వ వసతి గృహాలకు, గిరిజన గ్రామాలకు 30 వేల దోమతెరలు పంపిణీ
- కలెక్టర్ విజయ కృష్ణన్

సాక్షి, అనకాపల్లి: జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక ప్రతినిధులు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని కలెక్టర్ విజయ కృష్ణన్ కొనియాడారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పారిశ్రామిక ప్రతినిధులతో సమావేశమయ్యారు. కలెక్టరు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు తోడ్పడాలని తెలిపారు. విజయవాడలో వరద బాధితులకు అనకాపల్లి జిల్లా పారిశ్రామిక ప్రతినిధులు, ఇతర సంస్థల ప్రతినిధులు రూ.1.8 కోట్ల సాయం అందజేశారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ వసతి గృహాలకు, గిరిజన, ఆశ్రమ, పీవీటీజీ గ్రామాలు, మారుమూల గ్రామాలకు వివిధ కంపెనీల నుంచి సేకరించిన రూ.50 లక్షలతో 30 వేల దోమతెరలను పంపిణీ చేశామన్నారు. జిల్లా ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమలు కీలకమని, జిల్లా యంత్రాంగం వారికి కావలసిన సహాయ, సహకారాలను ఎల్లవేళలా అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పన చేపట్టాలన్నారు. జేసీ ఎం.జాహ్నవి మాట్లాడుతూ పరిశ్రమలు సామాజిక బాధ్యతగా చేపడుతున్న ప్రతీ సేవా కార్యక్రమం ప్రజల జీవితాలలో మార్పునకు కారణమవుతున్నాయన్నారు. కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో చేపట్టవలసిన సేవా కార్యక్రమాలు వివరాలు అందజేస్తే, తమ వద్ద ఉన్న ఆర్థిక వనరులతో తగిన పనులు చేపడతామని తెలిపారు. అనంతరం పరిశ్రమల ప్రతినిధులు కలెక్టరును సన్మానించారు. జ్ఞాపికలు, ప్రశంసాపత్రం అందజేశారు. డీఆర్వో బి. దయానిధి, ముఖ్యప్రణాళిక అధికారి బి.రామారావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జి. నాగరాజారావు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డుపై గుంతలతోనే ప్రమాదాలు

- యువకుడి మృతిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



యువకుడి మృతిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

రోలుగుంట: స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఛిన్నాభిన్నమైన బీఎన్ రోడ్డు గుంతలో పడి శుక్రవారం కొత్తకోటకు చెందిన కోట దొరబాబు(33) మృతి చెందాడు. దీన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం కొత్తకోటలో ఆందోళనకారులు రాస్తారోకో నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు మాట్లాడుతూ రోడ్డు మరమ్మతులు చేయకపోవడం వల్లే గత ప్రభుత్వాన్ని గద్దె దించారన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ నాలుగు నెలలుగా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దారి పొడువునా ఉన్న ఈ గోతుల్లో ఎనిమిది మంది వరకూ మరణించారన్నారు. కొత్తకోటకు చెందిన కోట దొరబాబు మరణాన్ని ప్రభుత్వ హత్యగా భావిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తకోటకు చెందిన అట్టల వేన్ రోలుగుంట మండల కార్యాలయాల కూడలిలో బోల్తా పడి వారం రోజులు కాకముందే అదే ప్రాంతానికి చెందిన దొరబాబు మరణించడం స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటికైనా రోడ్డు బాగు చేయాలని డిమాండు చేశారు. ఆందోళనలో రావికమతం మండల సీపీఎం నాయకుడు పాంగి చంద్రయ్య, గెమెల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నరసింగబిల్లిలో స్వచ్ఛతా హీ సేవ


చెత్తాచెదారాలు తొలగిస్తున్న సచివాలయ, పంచాయతీ, పారిశుధ్య సిబ్బంది

కశింకోట: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జెట్టపురెడ్డితుని, నరసింగబిల్లి గ్రామాల్లో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లు, వీధుల్లో చెత్తా చెదారాలు తొలగించారు. మురుగు కాలువలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ, పంచాయతీ కార్యదర్శి మేరీజోన్స్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పు వాడండి


అవగాహన కలిగిస్తున్న ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమ అధికారి విశ్వనాథం

కశింకోట: అయోడిన్ లోపం రాకుండా అయోడైజ్డ్ ఉప్పు వాడాలని జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమ అధికారి విశ్వనాథం కోరారు. అనకాపల్లి మండలం తుమ్మపాల హైస్కూలులో శనివారం విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధి గురించి, దాని లక్షణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ బారిన పడకుండా పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు. ఫ్లోరోసిస్ వల్ల దంతాలు పుచ్చుపోవడం, గార పడతాయన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ పెరిసిస్ రాణి, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఆశ కార్యకర్త కార్యక్రమంలో పాల్గొన్నారు.

3న మన నది స్వచ్ఛతా-మన చేతుల్లో..

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 3న స్థానిక శారదానది ఘాట్ వద్ద ''మన నది స్వచ్ఛతా-మన చేతుల్లో'' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేరోజు ఉదయం 8 గంటలకు స్థానిక మెయిన్ రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి ర్యాలీగా వెళ్లి శారదానది ఘాట్‌ను శుభ్రం చేస్తామన్నారు.

మాతా శిశు మరణాల శాతం తగ్గించాలి

- డీఎంహెచ్‌వో బాలాజీ


సమావేశంలో డీఎంహెచ్‌వో బాలాజీ, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

అనకాపల్లి: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మాతా శిశు మరణాల శాతాన్ని తగ్గించాలని డీఎంహెచ్‌వో ఎం.బాలాజీ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఐదేళ్లపు పిల్లల మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలన్నారు. ప్రజలు వివిధ వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధులపై పట్టణ, గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 53 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-27 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.


వివిధ రకాలైన ఫ్రూట్స్


పరిశుభ్రమైన కూరగాయలు

మన ఆరోగ్యం... చేతుల్లోనే..

- పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి
- తాజా కూరగాయలు, పండ్లు భాగం కావాలి
- వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత జాగ్రత్తలు తప్పనిసరి

అనకాపల్లి: మారుతున్న కాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. మూడు సంవత్సరాల క్రితం కోవిడ్ వంటి విపత్తుల తర్వాత మానవుని జీవనశైలి పూర్తిగా మార్పు చెందింది. మనుష్యులు రోగాలకు గురికావడం సహజంగా జరుగుతోంది. కారణం అప్పటి వరకూ ఒక విధమైన వాతావరణానికి అలవాటైన శరీరం.. తర్వాత నుంచి వాతావరణంలో మార్పురావడంతో ఏదోఒక వ్యాధి బారినపడక తప్పడం లేదు. పరిశుభ్రమైన ఆహారాన్ని తినేవారు కాలాలు మారినా వ్యాధుల బారిన పడాల్సి అవసరం ఉండదని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యాయామం, యోగా, ధ్యానం, మంచి ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు.

జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి

మానవుని జీవనశైలిలో తాజా కూరగాయలు, పండ్లు నిత్య ఆహారంలో భాగం చేసుకోవాలి. నిల్వ చేసిన ఆహార పదార్థాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. తీపి పదార్థాలు తక్కువగాను పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ప్రధానంగా పిజ్జాలు, బర్గర్లు, జంక్‌ఫుడ్స్, కూల్‌డ్రింక్స్ వంటికి దూరంగా ఉండాలి. డ్రింక్స్‌కు బదులుగా కొబ్బరి నీరు, మజ్జిగతో చేసే లస్సీ, బటర్ మిల్క్, చెరకు రసం తీసుకోవడం మంచిది.

పాలు, పప్పుధాన్యాలు, పండ్లకు అధిక ప్రాధాన్యం..

కలుషితమైన తాగునీటిని తీసుకోవడం వల్ల మనిషి త్వరగా వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాలాన్ని బట్టి పరిశుభ్రమైన తాగునీటిని తీసుకోవాలి. సాధ్యమైనంత విధంగా గోరువెచ్చని నీటిని తీసుకోవడం వల్ల వ్యాధుల బారినపడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఆహారంలో నిత్యం పప్పుధాన్యాలు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవడం మంచిది. ఉదయం, సాయంత్రం సమయాల్లో డ్రైఫ్రూట్స్ తీసుకోవడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. కాలానికి అనుగుణంగా పండ్లు తీసుకోవడం మంచిది. దీని వలన శరీరంలో రక్త ప్రసరణ బాగుంటుంది.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి

భోజనానికి, టిఫిన్‌కు ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. ఆహారం రుచి తెలియడమే కాకుండా త్వరగా జీర్ణమవుతుంది. ఆహారాన్ని ఒకేసారి ఎక్కువగా తీసుకోకుండా జాగ్రత్త పడాలి. జీర్ణ వ్యవస్థపై పెద్దగా భారం పడకుండా చూడాలి.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మన ఆరోగ్యాన్ని కాపాడుకునే బాధ్యత మన చేతుల్లోనే ఉంది. తాజా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు ఎక్కువగా తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చు. మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం మంచిది కాదు. శీతాకాలంలో త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి.

– వాణీజగదీశ్వరి, వైద్యురాలు, తుమ్మపాల పీహెచ్‌సీ, అనకాపల్లి మండలం

డ్రైనేజీ నిర్మాణానికి రూ.15 లక్షల విడుదల

మధురానగర్ కాలనీలో ఎంపీపీ గొర్లి సూరిబాబు పర్యటన


మధురానగర్ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో నరసింహరావు


డీఎస్‌టీ వసతి గృహంలో వంటశాలను పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి: గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని, ఎక్కడైన సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. తుమ్మపాల పంచాయతీ పరిధి మధురానగర్ కాలనీలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను శనివారం ఆయన పరిశీలించారు. మధురానగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి రహదారిపైకి మురుగు చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి కొత్త డ్రైనేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు మండల పరిషత్ నిధుల నుంచి విడుదల చేస్తామన్నారు. త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కాలనీ వాసుల వాడుక నీరు రహదారిపై పారడం వల్ల వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహరావు, వైస్ ఎంపీపీ విల్లూరి కుమారిచంద్రశేఖర్, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

డీఎస్‌టీ విద్యార్థుల వసతిగృహం పరిశీలన...

పట్టణంలోని గాంధీనగరం పార్కు సెంటర్ సమీపంలో డీఎస్‌టీ విద్యార్థులు వసతిగృహాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం సందర్శించారు. ఇక్కడ వివిధ విభాగాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పేద విద్యార్థులు మాత్రమే ఉంటారని, వారికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యతోపాటు, పరిశుభ్రమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరిసింహారావు, వసతి గృహం అధికారి నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని శనివారం వజ్ర కవచాలంకృతులతోపాటు పూలమాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

రక్తదాన, వైద్య శిబిరాలు రేపు


సీఐ స్వామి నాయుడు

కశింకోట: పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 28న కశింకోటలో రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఆ రోజు ఉదయం 7 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట కల్యాణ మండపంలో శిబిరాలు ప్రారంభిస్తామన్నారు. దాతలు ఇచ్చే రక్తం మరొకరి ప్రాణం నిలుపుతుందన్నారు. దీని దృష్ట్యా విద్యార్థులు, సంఘ సేవకులు, ప్రజలు, యువకులు కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

రైతుల ద్వారా సేంద్రియ ఉత్పత్తుల విక్రయం


రైతులకు అవగాహన కలిగిస్తున్న మాస్టర్ ట్రైనర్ అప్పలరాజు

కశింకోట: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను దళారుల బారిన పడకుండా నేరుగా వినియోగదారులకు విక్రయించుకోవాలని ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు రైతులకు సూచించారు. అనకాపల్లి మండలం పాపయ్యసంత పాలెం, మామిడిపాలెం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలను ప్రతి సోమవారం కలెక్టర్, మండల, మున్సిపల్ కార్యాలయాల ద్వారా అక్కడ పని చేస్తున్న సిబ్బందికి మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆర్గానిక్ మేళాలో అమ్ముకోవచ్చునన్నారు. ప్రస్తుత రోజుల్లో రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగించి పండించిన ఉత్పత్తులను తినడం వల్ల బీపీ, సుగర్, గుండెపోటు తదితర అనేక వ్యాధుల బారిన పడాల్సి వస్తోందన్నారు. వీటి నివారణకు ప్రకృతి ఉత్పత్తులు దోహదపడతాయన్నారు. యూనిట్ ఇన్‌చార్జి మళ్ల నాగేశ్వరరావు, ఐసీఆర్పీలు వెల్లూరు నాయుడు, సత్యవేణి, సాయి శ్యామల పాల్గొన్నారు.

72 మంది రోగులకు వైద్య పరీక్షలు


గవరపేటలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి యశోద


బీపీ పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కశింకోట: గవరపేటలో ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. ఇక్కడ శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 72 మంది రోగులను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సలహాలు, సూచనలిచ్చారు. దీర్ఘకాలిక రోగులకు బీపీ, సుగర్ పరీక్షలు, రక్త పరీక్షలు చేశారు. బీపీ, సుగర్ మాత్రలను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలకు ఆహ్వానం

కశింకోట: అనకాపల్లి పట్టణంలోని అన్ని హైస్కూళ్లకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నామని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం తెలిపారు. 'ఆంధ్ర రాష్ట్ర అవతరణ -అమరజీవి పొట్టి శ్రీరాములు పాత్ర' అంశంపై తెలుగులో వ్యాసం స్వయంగా రాసి ఈ నెల 30లోగా పంపించాలన్నారు. వీరిలో ప్రతిభావంతులకు ప్రథమ, ద్వితీయ, ప్రత్యేక బహుమతులను, ప్రశంసా పత్రాన్ని నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంలో అందజేస్తామన్నారు. విద్యార్థులు తమ వ్యాసాలను బల్లా నాగభూషణం, ఇంటి నంబరు 10.01.88, పిళ్లా వారి వీధి, చేపల బజారు వద్ద అనకాపల్లి -531001 చిరునామాకు పంపించాలన్నారు. వివరాలకు 8977020615, 9493256300 సంప్రదించాలన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెబుదాం

తెలుగు భాషా పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ రామ్మోహనరావు


తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తున్న రామ్మోహనరావు

అనకాపల్లి: కమ్మనైన అమ్మభాషను కలలో కూడా మరువకూడదని, భావితరాల కోసం రక్షించుకోవడం నేటి విద్యార్థులపై ఉందని తెలుగు భాషా పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ కె.రామ్మోహనరావు తెలిపారు. శనివారం స్థానిక గవరపాలెం జీవీఎంసీ బాలికోన్నత హైస్కూల్ ఆవరణలో 9, 10 తరగతి విద్యార్థినులకు తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ''తెలుగుకు వెలుగు నిద్దాం'' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాష తెలుగు ప్రపంచ దేశాల్లో ఎంతో గొప్పదన్నారు. నేటి యువత, విద్యార్థులు తెలుగు భాషపై విస్తృత స్థాయి ప్రచారాలు చేయాలని కోరారు. కథా రచయిత జి.రంగబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించే విధంగా కథలు, కవితలు, పద్యాలు రాయడానికి ప్రయత్నించాలన్నారు. తెలుగు భాషలో ప్రక్రియ మనకే సొంతమని, మంచి పద్యాలు పాడి రాబోయే తరానికి వివరించాలన్నారు. బాలికలు మంచి నడవడికతో ముందుకు సాగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రచయితలు శిష్ట్లా తమ్మిరాజు, అమర జ్యోతి, కవయిత్రి కె.మల్లేశ్వరి, ఇన్‌చార్జి హెచ్‌ఎం జ్యోత్స్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులే ఉపాధికి సోపానాలు


ఇండస్ట్రియల్ విజిట్‌కు వెళుతున్న విద్యార్థినులతో హెచ్‌ఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు


ఎలక్ట్రానిక్ పరికరాల పని తీరుపై బాలికలకు అవగాహన

కశింకోట: భవిష్యత్తులో వృత్తి విద్యా కోర్సులే ఉపాధికి సోపానాలు అని హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి తెలిపారు. స్థానిక బాలికల హైస్కూలులో వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా ఎలక్ట్రానిక్ చదువుతున్న బాలికలకు ఫస్ ఫస్టు గ్లోబెల్ స్కిల్లర్ సంస్థ సహకారంతో ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసిన పాఠశాలల్లో సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో బోధన, శిక్షణ అందిస్తున్నారన్నారు. 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఎలక్ట్రానిక్‌లో ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఎలక్ట్రానిక్ వస్తువులు విక్రయించి మరమ్మతులు చేస్తున్న స్థానిక దుకాణానికి తీసుకెళ్లి ఎలక్ట్రానిక్ పరికరాలు, వాటి పని విధానం, వాటి ఉపయోగాలు గురించి అవగాహన కలిగించారు. వృత్తి విద్యా ఉపాధ్యాయిని బి.నిర్మల, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు


ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న సీనియర్ జీఎం శ్రీనివాసరావు, ఎంఈవో మూర్తి


హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కశింకోట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించడం అభినందనీయమని ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు. సాగర్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం బయ్యవరంలో ఈ ఏడాది టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 13 ప్రభుత్వ హైస్కూళ్లు, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, గురుకుల పాఠశాలలకు చెందిన 39 మంది విద్యార్థులకు రూ. 5.85 లక్షల ప్రోత్సాహక బహుమతులను పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ కె. శ్రీనివాసరావుతో కలిసి ఆయన అందజేశారు. టెన్త్‌లో ఒక్కొక్క స్కూలుకు ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ.20 వేలు, ద్వితీయ స్థానం విద్యార్థికి రూ.15 వేలు, తృతీయ స్థానం విద్యార్థికి రూ.10 వేలు వంతున నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడేళ్లగా తమ పరిశ్రమ యూనిట్ తరపున ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. నాలుగు రాష్ట్రాల్లో ఆరు సాగర్ సిమెంట్ పరిశ్రమల యూనిట్లలో ఒకేసారి విద్యార్థులకు రూ.45 లక్షల ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామన్నారు. ఇవే కాకుండా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ప్రభుత్వ విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన కలిగించి పర్యావరణ పరిరక్షణకు 5500 నార సంచులను త్వరలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపీవో పి.వి. సురేష్, డీపీఎన్ హైస్కూలు హెచ్‌ఎం ఆచంట రవి, జిల్లా సైన్స్ అధికారి దాడి కాళిదాసు, పరిశ్రమ సీనియర్ మేనేజర్ పి.వి. పాండురంగారావు, సిబ్బంది, తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ హుండీ లెక్కింపు రేపు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో హుండీ ఆదాయాన్ని ఈ నెల 28న ఉదయం 9 గంటలకు లెక్కించనున్నట్లు దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే వారు పంచె, కండువా ధరించి ఉదయం 8 గంటలకు దేవస్థానం వద్ద కార్యాలయంలో ఆధార్ కార్డుతో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు


కుంచావారివీధిలో వరి దుబ్బు తెస్తున్న దృశ్యం


వేల్పులవీధిలో వరి దుబ్బు తెస్తున్న భక్తులు


జమాదులపాలెంలో గౌరమ్మను దర్శించుకుంటున్న ప్రజలు

కశింకోట: మండలంలోని జమాదులపాలెం, పరవాడపాలెం గ్రామాల్లో శనివారం గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో గౌరమ్మను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలలు, తలనీలాలు వగైరా రూపాల్లో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, జనసేన నాయకుడు భీమరశెట్టి రామకృష్ణ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, మండల మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, మాజీ సర్పంచ్ ఒమ్మి కోటేశ్వరరావు, పార్టీ నాయకుడు ఒమ్మి సత్యనారాయణ, జనసేన నాయకుడు కర్రి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు. ఉత్సవాలు పురస్కరించుకొని గౌరమ్మలను అందంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఆయా గ్రామాల్లో తప్పెటగుళ్లు, కోలాటాలు, నేల వేషాల మధ్య ఊరేగించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువు, ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా డాన్స్ బేబీ డాన్స్, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది.

గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం

అనకాపల్లి: పట్టణంలోని వేల్పులవీధి, కుంచావారి వీధిలో గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ముందుగా కుంచావారివీధిలో కుంచావారి కుటుంబ సభ్యులు, వేల్పులవీధిలో వేల్పుల గణేష్ వారి స్వగృహం వద్ద గౌరీపరమేశ్వరుల పీఠానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక పూడిమడక రహదారిలో వరి పొలంలో దుబ్బు తీసుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ నుంచి ఊరేగింపుగా పెరుగుబజార్ జంక్షన్‌లో ఉత్సవ విగ్రహాలు తయారు చేసిన శిల్పి వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించి ఆలయంలో నిలుపుదల చేశారు. ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి: కుటుంబ సమస్యలతో మండలంలో మూలపేట గ్రామానికి చెందిన పి.చంద్రశేఖర్(28) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై శనివారం పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ ఈశ్వరరావు వివరాలు మేరకు... చంద్రశేఖర్ బొలేరో వాహనం డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో ఆర్థిక సమస్యలు కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తండ్రి చిన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

3 గ్రామాల్లో పల్లె పండగ రేపు

కశింకోట: మండలంలోని మూడు గ్రామాల్లో ఈ నెల 28న పల్లె పండగ – పంచాయతీ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఏనుగుతుని, 9.45 గంటలకు నూతలగుంటపాలెం, 10.30 గంటలకు జెట్టపురెడ్డితుని పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

11న దివ్యాంగుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా


మాట్లాడుతున్న అప్పలనాయుడు

అనకాపల్లి: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వచ్చే నెల 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాలు వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోడూరు అప్పలనాయుడు తెలిపారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శనివారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల హక్కులపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర దాడి చేస్తోందన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను నిర్వీర్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అధిక అంగవైకల్యం కలిగిన వారికి నెలకు రూ.25 వేలు, ఎన్నికల హామీల్లో భాగంగా దివ్యాంగుల పింఛన్ నెలకు రూ.12 వేలు చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక జిల్లా నాయకులు బుగిడి నూకఅప్పారావు, షేక్ రెహమాన్, కుమారి, సింహాచలం, నూకరాజు, పి.సన్యాసిరావు పాల్గొన్నారు.